# చావుబ్రతుకే

సూరయ్య దగ్గుతున్నాడు.

"ఏమిటో ఎన్ని మందులు వాడినా ఈ దగ్గు నిన్ను వదలడం లేదు" అంది గైరమ్మ దిగులుగా.


"అవునే... పాడు దగ్గు. నన్ను రోజు రోజుకీ దిగజార్చేస్తోంది." అన్నాడు సూరయ్య దీనంగా.

"పట్నం పోయి మరో డాకటరకు చూపిద్దామా" అడిగింది గైరమ్మ.

ఎందుకే... మన ఊరికి వచ్చేది ఆ పట్నం డాకటరే" కదా అని, "మరొకరికి అన్నా, పట్నం అన్నా మాటలా? చాలా అవుతంది" అన్నాడు సూరయ్య.

"కాదా మరి?" అంటూ, "బుగతబాబును కలిసి అడిగితే సర్దుతారేమో" అంది గైరమ్మ ఆశగా.

"నీ పిచ్చిగానీ, ఆ బాబు వద్ద పాలేరుగా నేను పని చేస్తుండగా నా కాలు, చేయి విరిగిపోతేను, అప్పుడే అంత అంతగా సర్ది చేతులు దులిపేసుకున్న అతడు, ఇప్పుడు అతడికి ఏమీ కాని నాకు ఇంకేం సర్దుతారే" అన్నాడు సూరయ్య నిరాశగా.




"నేను అడగనా. ఇప్పుడు నేను ఆళ్ళ ఇంటి పనిమనిషిని కదా. ఆ మాత్రం సర్దరా" అంది గైరమ్మ.

"బాగుందే, అప్పుడు నాకు సర్దింది తిరిగి తీర్చుకోడానికే నిన్ను వాళ్ళు పనిలోకి తీసుకున్నారు. అది

ఏదో తీరి, ఆపై వస్తోంది. మన అవసరాలకు పనికొస్తోంది ఇప్పుడు. నువ్వు మళ్ళీ సర్దమంటే ఇక మన బతుకులు సాగవే" చెప్పాడు సూరయ్య.

"అదీ గాక నువ్వు తెస్తోంది, నేను రోడ్ల మీద చుద్ద, బొగ్గు ముక్కలతో బొమ్మలు గీసి తెస్తోంది ఎంత ఎంత. బొటాబొటీగా సరిపోతోంది. అందుకే మనకు మరో ఆలోచన ఇక వద్దు. లే, పనుల్లోకి పోదాం, పద" అంటూ లేచాడు సూరయ్య. తర్వాత అక్కడ ఒక మూలన కునుకుపాట్లు పడుతున్న కోతిని లేపి, దానిని తన వెంటేసుకొని బయటకు నడిచాడు.



బత్తుల వెంకట దుర్గా ప్రసాదరావు

గైరమ్మ ఒక దీర్ఘ నిట్టూర్పు తర్వాత ఇంటికి తాళం పెట్టి, బుగతబాబు ఇంటికి బయలుదేరింది.

★ ★ ★

సూరయ్యను చూస్తూనే "చొట్ట చూరి ఈ సారి కోతి బొమ్మగీచాడు" అంటూ అరిచారు పిల్లలు కేరింతలతో.

సూరయ్య తను గీసిన బొమ్మ పక్కన తన కోతితో కూచున్నాడు. పడే చిల్లర డబ్బుల వంక ఆశగా చూస్తున్నాడు.

సూరయ్య చాలా తమాషైన బొమ్మలు వేస్తుంటాడు. చూపరుల మెప్పును మెండుగా పొందుతుంటాడు. వారికి 'నిత్యం చూస్తోందే చూస్తున్నాం' అన్న భావం రాకుండా జాగ్రత్త పడుతుంటాడు.

తన ఊరికి కొద్ది మైళ్ళ దూరాన ఉన్న పట్నంలోనే కాక, చుట్టు పక్క ఊళ్ళల్లోనూ ఎండనక, రోగం అనక, తన సొట్ట నడకతో తిరుగుతూ రోడ్ల మీద బొమ్మలేస్తుంటాడు సూరయ్య. రోజూ పొద్దు తిరిగిన చాలాసేపటికి ఇంటిని చేరుకుంటాడు.

అప్పడికి గైరమ్మ, బుగతబాబు ఇంటిలో పనులు ముగించుకొని ఇంటికి చేరి, సూరయ్యకై ఎదురుచూస్తూ ఉంటుంది.

"ఈ వేళ ఇదే పోగు అయ్యిందే" అంటూ తను గీసిన బొమ్మల ద్వారా తనకు ముట్టిన డబ్బుల్ని గైరమ్మ దోసిటిలో వేస్తూ అంటాడు సూరయ్య.

గైరమ్మ ఆ డబ్బులను కళ్ళకు అద్దుకొని, కొంగున ముడి వేసుకుంటుంది. షావుకారు కొట్టుకు బయలుదేరుతుంది.

★ ★ ★

ఏ రోజూ తమ కోతికి లోటు జరగకూడదని గైరమ్మ, సూరయ్య తపిస్తుంటారు.

"ఎక్కడిదో, ఎప్పటినుంచో ఇది మన పంచన చేరి, మన ఎంగిలినే తింటూ, మన చెంతను వదలక పెరుగుతోంది. నా కాలు, చేయి పోయిన దగ్గరనుంచి ఒక విధంగా ఇది కూడా నన్ను నడిపిస్తోంది. ఉల్లాసపరుస్తోంది." అని తరచూ ఆ కోతిని తన ఒడిలోకి తీసుకొని అంటూ ఉంటాడు సూరయ్య.

"నిజమే, మనకు పిల్లలు లేని కొరత ఇది తీరుస్తోంది" అంటుంది గైరమ్మ.

★ ★ ★


"ఏమిటో, ఈ రోజు నోట్లు తెచ్చావు. ఇంత డబ్బు ఎలా వచ్చింది?" అంది గైరమ్మ – సూరయ్య తన దోసిళ్ళలో వేసిన చిల్లర డబ్బులతో పాటు నోట్లను కళ్ళకు అద్దుకుంటూ.

"మరేమో, ఎవరో ఇంకో దేశం బాబట. నేను గీచిన బొమ్మను చూసి, తెగ మెచ్చుకున్నాడు. అంతే కాదే, నా బొమ్మను ఫొటోలు తీశాడు. అదేదో, ఆ... వీడియా అట, అది తీశాడు. అతడే ఈ నోట్లు ఇచ్చాడు." చెప్పాడు సూరయ్య తెగ పొంగిపోతూ. అంతలోనే అతడికి తెరలు తెరలుగా దగ్గు వచ్చింది.

"నీకు ఇంకా దగ్గు తగ్గడం లేదు. మరి మనం పట్నం పోయి, ఈ డబ్బుతో మంచి డాకటరుకు చూపిద్దాం, మందులు కొందాం." అంది గైరమ్మ పట్టుదలగా.

"ఊరుకోయే... వాడుతున్న మందులు చాల్లేయే. అదే తగ్గుతుందిలే." అని, "మరేమో, ఆ డబ్బుతో నువ్వు చీర కొనుక్కోయే" అన్నాడు సూరయ్య అనురాగంగా.

"నాకు ఉన్నవి చాల్లే. వాళ్ళు, వీళ్లూ ఇస్తున్న




పాత బట్టలు నాకు ఎలాగూ ముదుతున్నాయి" అని, "నువ్వు రోగంతో నీరసమయిపోతుంటే, నేను చీరలు కొనుక్కోవాలా?" అంది గైరమ్మ బాధగా.

★ ★ ★

గైరమ్మ చెప్పింది వినరా సూరయ్యా, పట్నం పోయి డాకటరుకు చూపించుకో" అన్నాడు పక్కింటి రౌతునాయుడు.

"చాల్లే మామా, ఇంకెన్ని వాడేది? తగ్గేద యితే ఈ పాటికి తగ్గేది." అన్నాడు సూరయ్య దగ్గుతూనే.

"ఎవడో ఇంకో దేశం వాడట, నూరు మీద ఏబయికి నోట్లిచ్చాడట కదా. వెళ్ళకూడదూ, డబ్బుంది కదా" అన్నాడు రౌతునాయుడు.

"వద్దు మామా! అదే తగ్గుతుందిలే" అనే సాడు సూరయ్య.

★ ★ ★

తెరలు తెరలుగా సూరయ్యకు దగ్గు వస్తోం ది. ఈ మధ్య తెగ హైరానా పడిపోతున్నాడు. అతడి అవస్తను చూసి గింజుకుంటుంది గైర మ్మ.

"ఏమిటో, ఈ పూట దగ్గు ఇంకా ఎక్కువైం ది. డాకటరు ఉన్నాడేమో చూసిరానా" అడి గింది గైరమ్మ.

"ఎప్పుడో పొద్దుపోయింది. ఇంకా ఆ డాకటరు ఉంటాడా? పట్నంకు తిరిగిపోయి ఉంటాడు" ఆయాసంలోనే మాట్లాడేడు సూ రయ్య.

"పక్కకు తిరిగి పడుకోరాదా" అంది గైర మ్మ.

"కూచోడానికే వీలు కాకుంటుందే" అన్నా డు సూరయ్య.

మూలన ఉన్న కోతి బిక్కు బిక్కుమంటూ సూరయ్యను చూస్తోంది.

గైరమ్మ లేచి, పక్కింటికి వెళ్ళింది. రౌతునాయుడును వెంట పెట్టుకొని తిరిగి వచ్చింది.

"మందు తీసుకొని ఎంతసేపు అయ్యింది" అడిగాడు రౌతునాయుడు, సూరయ్య గుండె మీద చేత్తో నెమ్మదిగా రుద్దుతూ.

"చాలాసేపు కావస్తోందయ్యా" చెప్పింది గైరమ్మ, కన్నీళ్ళను చీర కొంగుతో వత్తుకుంటూ.

"డాకటరు ఎలాగూ ఇప్పుడు ఉండడు. బడి మాస్టారును పిలుచుకురానా. ఆయనకూ వైద్యం వచ్చు" అన్నాడు రౌతునాయుడు.

"వద్దు మామా" అన్నాడు సూరయ్య.

సూరయ్యను ఉద్దేశించి, "అలాగే అంటావు" అని, రౌతునాయుడుతో, "అయ్యా, ఆ బాబును తీసుకురావా" అంది గైరమ్మ బేలగా.

రౌతునాయుడు వెళ్ళాడు. మాస్టారును తీసుకొని వచ్చాడు.

అప్పటికి సూరయ్యకు దగ్గు తగ్గింది. ఒక పక్కకు తిరిగి పడుకొని ఉన్నాడు.

గైరమ్మ అతడికి దగ్గరగానే ఉంది.

కోతి ఆ మూలనే కునికిపాట్లు పడుతోంది.

మాస్టారు రౌతు నాయుడుతో మాట్లాడి వెళ్ళిపోయాడు.

★ ★ ★

"నా మాట వింటావా" అడిగాడు రౌతునాయుడు సూరయ్యను.

"అదేమిటి మామా, నీ మాట వినకపోవడం ఏమిటి? మా సొంతం వారు మమ్మల్ని ఖాతరు చెయ్యనప్పుడు నువ్వే కదా మమ్మల్ని చూసింది" అని, "మమ్మల్ని నువ్వు ఆదుకున్నావు, ఈ గూడును చూపావు, చెప్పు మామా" అన్నాడు సూరయ్య ఒదిగిపోతూ.

"ఆ గురితోనే నా మాట కాదనకు." అని ఆగి, చెప్పాడు రౌతునాయుడు "నువ్వు ఆ కోతిని వదులుకో"

"మామా, ఏమిటి నువ్వు అంటోంది? కోతిని వదులుకోవాలా? ఏం, ఎందుకు?" అన్నాడు సూరయ్య విస్మయంగా.

గైరమ్మ అక్కడకు దగ్గరలోనే నిల్చుని ఉంది. మూగగా ఏడుస్తోంది. కోతి మూలన కూర్చుని అరటి పండు తింటోంది.

"అవును సూరయ్యా, ఇక నువ్వు కోతితో తిరగకూడదు. దానిని నీ దరికే రానియ్యకూడదు" చెప్పాడు రౌతునాయుడు.

సూరయ్య గమ్మున తలెత్తి గైరమ్మ వంక చూశాడు.

గైరమ్మ కోతిని చూస్తోంది.

సూరయ్య తల తిప్పి అటు చూశాడు.


కోతి ఇంకా అరటిపండు తింటోంది.

"మాస్టారు చెప్పాడు. కుక్క, కోతి లాటి వాటి వలన జబ్బులు రావచ్చుట. ఆఖరికి కోడిని కూడా దూరంగానే ఉంచి పెంచాలట. అందుకే నువ్వు కోతిని వదులుకోవడం మంచిది" చెప్పాడు రౌతునాయుడు.

ఆందోళన పడుతున్నాడు సూరయ్య. అస్తవ్యస్తంగా చూస్తున్నాడు. అంతలోనే అతడికి దగ్గు మొదలైంది.

"చూశావా? ఎన్ని మందులు వాడుతున్నా నీకు ఇంకా దగ్గు తగ్గడం లేదు. మాస్టారి మాటని కొట్టేయవద్దు. ఆయన అన్నీ బాగా తెలిసిన వాడు. గైరమ్మ కూడా ఆయన చెప్పింది వింది. మా మాట విను" అన్నాడు రౌతునాయుడు.

సూరయ్యకు రాను రాను దగ్గు ఎక్కువ అవు




తోంది. గిలగిల్లాడిపోతున్నాడు.

గైరమ్మ ఇంకా ఏడుస్తూనే ఉంది.

కోతి ఆ మూల నుండే ప్రేక్షకుడిలా అంతటినీ చూస్తోంది.

★ ★ ★

"నువ్వే చెప్పుకో గైరమ్మా. నా వలన కావడంలేదు" అని, "మీరు ఆ కోతిని ఇక్కడ నుంచి తరిమేయండి. లేదంటే దాని వలన మీకు రానున్న పెద్ద ముప్పు తప్పదు" అన్నాడు రౌతునాయుడు.

"మనసు దిట్టా చేసుకొని నేను ఆయనకు చెప్పుతున్నానయ్యా" అని, "ఆయన మరి వినడు. ఇక నన్ను ఏం చెయ్యమంటావయ్యా" అంది గైరమ్మ బొంగురుగా.

"నువ్వే దానిని తీసుకుపోయి ఎక్కడో దూరంగా వదిలేసి రా" చెప్పాడు రౌతునాయుడు.

గైరమ్మ ఏమీ మాట్లాడలేదు.

"నువ్వు అలా చెయ్యకపోతే, సూరయ్య ప్రాణంకే ముప్పు" చెప్పాడు రౌతునాయుడు.

★ ★ ★

ఇప్పుడు సూరయ్య ఆరోగ్యం మరింతగా క్షీణించి పోయింది.

కోతి మూలంగానే సూరయ్య అనారోగ్యం పాలయ్యాడని ఆ చుట్టుపక్కల వారు అనుకుంటున్నారు.

"ముందు నీ మొగుడు నీకు ముఖ్యం. అది చూసుకో. ఆ కోతిని వదిలించుకో" వారు అంటున్నారు గైరమ్మ వద్ద.

★ ★ ★

గైరమ్మ మెదడు మొద్దుబారిపోయింది. సూరయ్య పరిస్థితి ఆమెను పూర్తిగా లొంగతీసేసింది.

కోతిని సూరయ్యకు తెలియకుండా తీసుకొని పోయి, ఊరికి ఒక పొలిమేరన ఉన్న గుట్ట

దాటి, అక్కడ తుప్పల్లో దానిని వదిలి వచ్చేసింది ఇంటికి. "కోతి ఏదే" అడిగాడు సూరయ్య ఇంటి లోకి వస్తున్న గైరమ్మను.

ఆమె గతుక్కుమంది. బెంబేలు పోతూ భర్త ను చూస్తోంది.

"ఏమిటే అలా ఉండిపోయావు. అది ఏదీ" అన్నాడు సూరయ్య అయోమయంగా.

"అదీ... అదీ... ఏమో... ఏమో..." తడ బడుతోంది గైరమ్మ.

"అయ్యో, ఏమైందే? కోతి ఏది? చాలా సేపటి నుంచి కనబడడం లేదు. ఇంతవరకూ నీతో ఉందనుకున్నాను" అంటూ పక్కమీద నుం చి లేచాడు సూరయ్య.

ఇప్పుడు సూరయ్య చాలా నీర్సంగా ఉన్నా డు. దగ్గుతూ బయటకు వెళ్ళడానికి ప్రయత్ని స్తున్నాడు.

"ఎటు పోతున్నావు?" అడిగింది గైరమ్మ, సూరయ్యను ఆందోళనగా.

"కోతి ఎటు పోయిందో చూడాలే" అని, "పాపం దానికి ఒక కన్ను కనబడదు కదా" అన్నాడు సూరయ్య బెంబేలుగా.

"నేను... నేను వెళ్ళి వెతుక్కు వస్తాను. నువ్వు పడుకో" అంది గైరమ్మ ప్రయత్నంతో.

"నువ్వా... సరే, నువ్వే వెళ్ళు. నేను వెళ్ళలేక పోతున్నాను." అని, "చూడు... గుడి దగ్గర మర్రి చెట్టు ఉంది కదా, అక్కడకు పోయి చూడు. దానికి ఆ చోటు చాలా ఇష్టం. పిల్లలు దానిని అల్లరి చేస్తున్నారేమో. త్వరగా వెళ్ళు" చెప్పాడు సూరయ్య.

గైరమ్మ మరో ఆలోచన లేనట్టు బయటకు నడిచింది. అక్కడక్కడా తిరిగి తిరిగి ఇంటికి వచ్చి, 'ఎక్కడా లేదు' అని చెప్పబోతోంది.

"గైరమ్మా నువ్వు అలా వెళ్ళావా, ఇది ఇలా వచ్చేసింది" అన్నాడు సూరయ్య, తన ఒడిలోని కోతిని నిమురుతూ.

గైరమ్మ చెంప చెళ్ళుమన్నట్టు కదిలిపో యింది. తేరుకోలేకపోయింది.

తేరుకొని తలెత్తి చూసేసరికి, కోతిని పక్కన వేసుకొని ఉన్న సూరయ్య కనిపించాడు గైర మ్మకు.

★ ★ ★

సూరయ్యకు దగ్గు ఎక్కువైంది. నోటంట రక్తం కూడా పడుతోంది. ప్రేమ, అనుబంధం, అనురాగంల నడుమ గైరమ్మ ఏమీ తేల్చుకోలేక సతమతమైపోతోంది, నలిగిపోతోంది.

"ఏమిటమ్మా ఇంకా దానినే పట్టుకు వేలా డుతున్నారు? ఆ కోతితో నీ మొగుడు చావును కోరి తెచ్చుకుంటున్నావు" అని అంతా తనతో కటువుగా అన్న తర్వాత గైరమ్మ తెగింపుకు వచ్చింది.

★ ★ ★

ఆ రాత్రి గైరమ్మకు నిద్ర పట్టడంలేదు.

సూరయ్య దగ్గుతూనే ఉన్నాడు.

సూరయ్య ఎప్పుడు నిద్ర పోతాడా అని వేచి ఉంది గైరమ్మ.


చాలాసేపటికి సూరయ్య వైపు నుంచి దగ్గు వినిపించడం ఆగిపోయింది.

---

"అరటిపండు గొప్పతనం గురించి చెప్పరా రామూ" - టీచర్ అడిగాడు.

"ఏముంది సార్! తింటే బలపడతాం, తొక్కితే జారిపడతాం" సమాధానం ఇచ్చాడు రాము.

---




'నిద్రపోయాడు' అనుకుంది గైరమ్మ.

అంతే -

పూనకం వచ్చిన దానిలా లేచి, మూలన పడుకొని ఉన్న కోతిని ఒడుపుగా చంకన వేసుకొని బయటకు నడిచింది గైరమ్మ. పెంపుడు కోతిని చంపడానికే నిర్ణయించుకొంది.

ఊరంతా ఆదమరిచి నిద్రలో ఉంది.

గైరమ్మ నేరుగా ఊరికి ఉత్తరాన ఉన్న పాడుబడ్డ ఊబి బావి వైపు నడుస్తోంది.

నడక దారి తుప్పలు మధ్యగా ఉంది.

ఆ దారి వెంబడి పోతున్న గైరమ్మ టక్కున ఆగిపోయింది.

ఆ దారికి అడ్డంగా పడగ విప్పి బుసకొడుతున్న పాము...

ఆ పామును చూసి గైరమ్మ నిశ్చేష్టురాలై ఆచేతనంగా నిలబడి ఉండిపోయింది.

కోతి ఒక్క ఉదుటున గైరమ్మ చంకలోనుంచి కిందకు దుమికింది. బుసకొడుతున్న పాముని నిర్భయంగా తరిమికొట్టింది.

తిరిగి గైరమ్మను చేరింది ప్రేమగా.

పూర్తిగా తేరుకున్న గైరమ్మ చలించిపోయింది.

ఒక్కమారుగా కోతిని ఎత్తుకొని వెనుతిరిగింది.

నిశ్చలంగా, నిబ్బరంగా ఇంటికి వచ్చింది.

కోతిని దాని పక్క మీదకు చేర్చింది.

తనూ తన పక్క చేరింది. తను చేయబోయిన పనిని తలుచుకుని నొచ్చుకొంది. కలత పడింది. మెల్లిగా తనూ నిద్రపోయింది.

గైరమ్మ లేచేసరికి తెల్లవారి పోయింది.

సూరయ్య, కోతిలకై చూసింది.

సూరయ్య కోతితో ఆడుకుంటున్నాడు.

గైరమ్మ పనుల్లోకి చొరబడింది చిన్నగా, సంతృప్తిగా నవ్వుకుంటూ. ●